క్లుప్తంగా

23న మండల సర్వసభ్య సమావేశం

పుల్లంపేట: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 23వ తేది నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రఘురాం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీలు హాజరుకావాలని ఆయన కోరారు.

పీఆర్‌టీయూ రాయచోటి అధ్యక్షుడిగా శ్రీనివాసులు


శ్రీనివాసులు

రాయచోటి టౌన్ :పీఆర్‌టీయూ రాయచోటి మండల అధ్యక్షుడిగా మాధవరంలోని ప్రాథమిక పాఠశాలలో పని చేసే శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లుగా రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు తెలిపారు. శనివారం రాయచోటి డైట్ కేంద్రంలో నూతన కార్యవర్గం నిర్వహించారు. ఈసందర్భంగా అధ్యక్షుడితో పాటు కమిటీ సభ్యులుగా పాలగిరి పక్కీరాలను ఎంపిక చేశారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం


గెలుపొందిన విజేతలకు మెమెంటోలు అందజేస్తున్న దృశ్యం

పుల్లంపేట: ఆడుదాం–ఆంధ్ర క్రీడల్లో భాగంగా శనివారం పుల్లంపేట ఎస్‌బీవీడీ సభా క్రీడా మైదానంలో మండలస్థాయి క్రీడా పోటీలను పుల్లంపేట ఏఎస్‌ఐ సుబ్బరాయుడు, ఎంపీడీఓ రఘురాం ప్రారంభించారు. హోరాహోరిగా సాగిన ఈ క్రీడల్లో రంగంపల్లి జట్టు నియోజకవర్గస్థాయికి ఎంపికైంది. అలాగే కబడ్డీలో కొత్తపేట సచివాలయం, బ్యాడ్మింటన్ రంగంపల్లి సచివాలయం, వాలీబాల్ కొత్తపేట సచివాలయం వారు నియోజకవర్గానికి ఎంపికైనట్లు వారు తెలిపారు. ఏఓ ఖాన్, జేఏసీ కన్వీనర్ ఎన్ హరినాథరెడ్డి, సిద్దు పాల్గొన్నారు.

ఘనంగా గొబ్బెమ్మ నిమజ్జనం


గొబ్బెమ్మను నిమజ్జనానికి తీసుకెళ్తున్న ఆర్యవైశ్య మహిళలు

నందలూరు (రాజంపేట): మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయం నుంచి శనివారం ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షతన గొబ్బెమ్మ నిమజ్జనం ఘనంగా జరిగింది. మహిళలు గొబ్బెమ్మను చెయ్యేరు నది వద్దకు తీసుకెళ్లి అక్కడ పూజలు నిర్వహించి చెయ్యేరులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు గెలివి జయలక్ష్మీ, ఉపాధ్యక్షురాలు చలపాటి మాధవి, సభ్యులు మాకం జయశ్రీ, చలపాటి వాసవీ, ఎంబలూరు రాధిక, ఎంబలూరు కళ్యాణి, మేడా లక్ష్మీ, గెలివి యశోద, అమృత, తదితరులు పాల్గొన్నారు.

నాటక ప్రదర్శనను విజయవంతం చేయాలి

రామసముద్రం : మండల కేంద్రంలోని గుంతలపేట గ్రామంలో వెలసిన శ్రీఆంజనేయస్వామి ఆలయం వద్ద ఈనెల 25న జరిగే శ్రీ మహాభారత అభినయ నాటకం ప్రదర్శనను విజయవంతం చేయాలని టీటీడీ ఆస్థాన భగవతారిని చంద్రశేఖర్, టిటీటీ విశ్రాంత ఉద్యోగి టి.నారాయణ, సీనియర్ కళాకారుడు నాగప్ప తెలిపారు.

108 వాహనంలో ప్రసవం

కేవీపల్లె : మండలంలోని నూతనకాల్వ పంచాయతీ గుట్టలపై నడింపల్లెకు చెందిన మల్లికార్జున భార్య జోత జయమ్మకు శనివారం రాత్రి పురిటినొప్పులు రావడంతో 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. 108 వాహనం గ్రామానికి చేరుకుని జయమ్మను పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించడానికి బయలు దేరారు. అయితే మార్గం మధ్యలో నూతనకాల్వ సమీపంలో 108 వాహనంలోనే జయమ్మ ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారు.

జింక పిల్లను కాపాడిన వెల్ఫేర్ అసిస్టెంట్

పెద్దతిప్పసముద్రం: కందుకూరు సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేసే మధు కుక్కల బారి నుంచి ఓ జింక పిల్ల కాపాడారు. శనివారం తిమ్మిరెడ్డిపల్లి క్రాస్ వద్ద అటవీ ప్రాంతం నుంచి తప్పిపోయిన జింక పిల్లను కుక్కలు వెంటపడగా చూసిన మధు వాటి నుంచి జింక పిల్లను కాపాడారు. అనంతరం అటవీ శాఖ బీట్ అధికారి హనుమంత్‌రావ్‌కు అప్పగించారు.

వైఎస్సార్ క్లినిక్ తనిఖీ

ములకలచెరువు : మండలంలోని సోంపల్లి వైఎస్సార్ క్లినిక్ ను ఎంపీడీఓ పోలప్ప శనివారం ఆగస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది పనితీరుపై ఆరాతీశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం క్లినిక్‌కు వచ్చిన రోగులతో మాట్లాడారు.

వైఎస్ జగన్ ముస్లింల పక్షపాతి


రాజంపేట టౌన్: శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ప్రజా ప్రతినిధులు


సిద్దవటం: గ్రామ సచివాలయ భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ అమర్‌నాథ్ రెడ్డి

రాజంపేట టౌన్: సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీల పక్షపాతి అని ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి, ఎమ్మెల్సీ పి. రామసుబ్బారెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు తెలిపారు. మండలంలోని పెద్దకారంపల్లె పంచాయతీలో ప్రభుత్వం ముస్లింలకు కేటాయించిన శ్మశాన వాటికలో రూ.33 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని శనివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో తొలి నుంచి ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం పాటుపడుతున్న ఏకైక కుటుంబం వైఎస్ కుటుంబమని తెలిపారు. గతంలో ముస్లిం మైనార్టీలు అనేక మంది పేదరికం, వివిధ కారణాల రీత్యా ఉన్నత విద్య అభ్యసించలేకపోయేవారన్నారు. అందువల్ల అప్పటి సీఎం దివంగత వైఎస్.రాజశేఖర్ రెడ్డి ముస్లిం మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించారని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. రాజంపేటలో ముస్లింలకు ఏ సమస్య వచ్చినా వైఎస్సార్ సీపీ తొలి నుంచి అండగా నిలుస్తోందన్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు చెప్పే అబద్ధపు మాటలను ముస్లిం మైనార్టీలు నమ్మవద్దని కోరారు. పేద ముస్లిం ఆడపిల్లల వివాహాలకు గత ప్రభుత్వం కేవలం రూ.50 వేలు మాత్రమే ఆర్థిక సహాయం చేసేదని, సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి లక్ష రూపాయలు ఆర్థిక సహాయం చేస్తున్నారని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. జగన్ మళ్లీ సీఎం అయితేనే సంక్షేమ పథకాలు కొనసాగి ప్రజలు ఆర్థికస్వావలంబన సాధించగలరని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ముస్లీం మైనార్టీలు జగన్‌కు సంపూర్ణ మద్దతు ఇచ్చి వైఎస్సార్ సీపీకి ఘనవిజయం సాధించిపెట్టాలని కోరారు. రాష్ట్ర ఉద్యాన సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఏపీ ఆర్‌డీసీ రాష్ట్ర డైరెక్టర్ జి.గుల్జార్‌బాషా, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు పోలి మురళీరెడ్డి, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జ్ వద్దే రమణ, శ్మశాన వాటిక అభివృద్ధి కమిటీ ప్రతినిధులు హైదర్, న్యామత్, జాహీద్‌అలీ, మసూద్, వైఎస్సార్ సీపీ దళిత విభాగం నాయకుడు దాసరి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కొత్త భవనాలు ప్రారంభం

సిద్దవటం: మండలంలోని పెద్దపల్లి గ్రామ పంచాయతీలోని భాకరాపేటలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, వాటర్ ప్లాంట్లను శనివారం ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ సిద్దవటం మండల ఇన్‌చార్జి మేడా మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయ శిలాఫలకాన్ని, రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ప్రారంభించగా.. వాటర్ ప్లాంటును మేడా మధుసూదన్‌రెడ్డి ప్రారంభించి పూజలు చేశారు. జెడ్పీటీసీ ఉపాసి శ్రీకాంత్ రెడ్డి, ఉప మండలాధ్యక్షుడు నారపురెడ్డి శ్రీనివాసుల రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్ నీలకంఠారెడ్డి, యూత్ కన్వీనర్ క్రిష్ణ చైతన్య, స్థానిక సర్పంచ్ తుర్రా చిన్నక్క, ఎంపీటీసీ సభ్యులు రమాదేవి, చంద్రశేఖర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్‌నూర్, మార్కెట్ కమిటీ చైర్మన్ దీపం లక్ష్మిదేవి, మాజీ చైర్మన్ రాజేశ్వరిరెడ్డి, పార్టీ నాయకులు కె.వి. సుబ్బయ్య, ప్రతాప్, నాగం నరసింహారెడ్డి, నిమ్మకాయల ప్రసాద్‌రెడ్డి, గోపాలస్వామి, వావిళ్ల శ్రీనివాసులరెడ్డి, కె.వి. సుబ్బారెడ్డి, శోభన్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, మేకపాటి సుబ్బారెడ్డి, రావుల సుబ్బారెడ్డి, ఎల్లారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, కె. రమణ, జ్యోతి లక్ష్మిరెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణే లక్ష్యం

రాజంపేట డీఎస్పీ చైతన్య


రోడ్డు భద్రతా వారోత్సవాల కరపత్రాలను విడుదల చేస్తున్న డీఎస్పీ చైతన్య, ఎంవీఐ వినోద్‌కుమార్

రాజంపేట: ప్రమాదాలబారిన పడకుండా వాహనదారులను చైతన్యపరిచేందుకే రోడ్డు భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తున్నామని రాజంపేట డీఎస్పీ చైతన్య తెలిపారు. శనివారం ఎంవీఐ కార్యాలయం క్యాంపస్‌లో ఎంవీఐ బీ.వినోద్‌కుమార్‌తో కలిసి రోడ్డుభద్రతా వారోత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ బైకులు నడిపే ప్రతి ఒక్కరు హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. మద్యం తాగి నడపడం నేరమన్నారు. మైనర్లు వాహనాలను నడపరాదని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు రవాణాశాఖ నిబంధనలు పాటించాలన్నారు. ఆటో డ్రైవర్లు కూడా చట్టప్రకారంగా నడుచుకోవాలని సూచించారు. ఎంవీఐ వినోద్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా రవాణాశాఖ అధికారి దినేష్ చంద్ర ఆదేశాల మేరకు రోడ్డు భద్రతా వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశామన్నారు. ప్రమాదాల నివారణే లక్ష్యంగా రోడ్డు భద్రత వారోత్సవాలు జరుపుతున్నామన్నారు. ఎస్‌డీపీఓ సిబ్బంది, రవాణాశాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించండి


ఆరోగ్య కేంద్రంలోని రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి కొండయ్య

ఓబులవారిపల్లె: ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి ఎస్. కొండయ్య పేర్కొన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ తనిఖీలో భాగంగా ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించామని, ఆరోగ్య కేంద్రంలో రికార్డులు, పరిసరాలను పరిశీలించినట్లు తెలిపారు. అనంతరం స్థానిక వైద్యులతో మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. వైద్యాధికారి గురు మహేష్, సీహెచ్‌ఓ నగేష్, ఫార్మసిస్టు లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

జోనల్ స్థాయి క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ


క్రీడాకారులకు సర్టిఫికెట్స్‌ను అందచేస్తున్న చొప్పా యల్లారెడ్డి

రాజంపేట: విజ్ఞాన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈనెల 19న మోహన్‌బాబు యూనివర్సిటీలో నిర్వహించిన జోనల్ లెవల్ మహోత్సవ క్రీడలలో ఏఐటీఎస్ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ మేరకు శనివారం వారిని ఏఐటీఎస్ వైస్‌చైర్మన్ చొప్పా యల్లారెడ్డి, ప్రిన్సిపాల్ నారాయణ అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు కబడ్డీలో సిల్వర్‌మెడల్, వాలీబాల్‌లో కాంస్యపతకాలను సాధించారన్నారు. ఫిజికల్ డైరక్టరు డా.నాగముని మాట్లాడుతూ ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో గుంటూరులో జరగబోయే నేషనల్ లెవల్ మహోత్సవానికి రెండు టీంలు ఎంపికైనట్లు వివరించారు. కార్యక్రమంలో ఏపీడీ సైఫుల్లా, క్రీడాకారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ప్రతిభా పరీక్షలో ప్రతిభ


గద్దె లక్ష్మీశ్రీసాయి శరణ్య

ఒంటిమిట్ట: జాతీయ స్థాయి ప్రతిభా పరీక్ష (ఎన్.ఎం.ఎం.ఎస్2023) లో కొత్తమాధవం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం. నాగలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆమె మాట్లాడుతూ 2023 డిసెంబర్ 3వ తేదీన కడపలో జరిగిన ఎన్.ఎం.ఎం.ఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్) పరీక్షలో తమ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు గద్దె లక్ష్మీశ్రీసాయి శరణ్య, బచ్చల చరణ్‌కుమార్ ఉత్తీర్ణత సాధించారన్నారు. ఎన్ఎంఎంఎస్ పాఠశాల నోడల్ అధికారి అక్కిదాసరి పుష్పరాజ్ , పాఠశాల ఉపాధ్యాయులు, ఆఫీస్ సిబ్బంది విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారన్నారు. ఈ విద్యార్థులకు 4 సంవత్సరాల పాటు ప్రతి సంవత్సరం రూ. 12వేలు స్కాలర్‌షిప్ వస్తుందన్నారు. జాతీయ స్థాయి పరీక్షలో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేసిన ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి అభినందనలు తెలిపారు.

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి


గెలుపొందిన క్రీడాకారులకు మెమెంటోలు అందిస్తున్న మాజీ డీసీఎంఎస్ చైర్మన్, ఎంపీపీ

సంబేపల్లె : యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, నిరంతరం సాధన చేయడం ద్వారా మానసిక ఒత్తిడిని జయించవచ్చని మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ఆడుదాం–ఆంధ్ర క్రీడలలో భాగంగా శనివారం మండలస్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు ఆయన మెమెంటోలు ఎంపీపీ నాగశ్రీలక్ష్మి చేతుల మీదుగా క్రీడాకారులకు అందించారు. వార్డు, సచివాలయస్థాయి క్రీడలలో రాణించిన క్రీడాకారులు మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారు జరగబోయే నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో మంచి ప్రతిభచూపి సంబేపల్లె మండలానికి మంచిపేరు తేవాలని వారు ఆకాంక్షించారు. క్రీడాకారులు, ఎంపీడీఓ నరసింహులు, తహశీల్దార్ మహేశ్వరీబాయ్, పంచాయతీ సెక్రటరీలు, పీడీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రం అందజేత

సిద్దవటం: సిద్దవటం గ్రామ పంచాయతీలో అంగన్‌వాడీ ఆయాగా ఎంపికైన మంజులకు ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి శనివారం సాయంత్రం తన కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేశారు. సిద్దవటం పంచాయతీలోని 5వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రానికి ఆమె ఆయాగా ఎంపికయ్యారు.

ఆక్రమణను అడ్డుకున్న అధికారులు


ఆక్రమణ భూమిలో సూచిక బోర్డును ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

గాలివీడు: ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నట్లు మండల ఆర్‌ఐ బాలాజీ పేర్కొన్నారు. మండలంలోని గోరాన్‌చెరువు గ్రామం కరిమిరెడ్డిగారిపల్లె గోపనపల్లె మార్గంలో ప్రభుత్వ పాఠశాల పక్కనే గల సర్వే నెంబరు 1762గల 90సెంట్లు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకునేందుకు కొందరు ప్రయత్నాలు చేశారు. ఈ మేరకు చదును చేసి షెడ్ల నిర్మాణంతో పాటు మామిడి మొక్కలు నాటే ప్రయత్నం చేశారని, సమాచారం రావడంతో ఆక్రమిత భూమిని పరిశీలించి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశామని ఆర్‌ఐ వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూమిలో ఆక్రమణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనతో పాటు స్థానిక వీఆర్‌ఓ, సర్వేయర్ పాల్గొన్నారు.

యునిసెఫ్ రాష్ట్ర స్థాయి వర్క్ షాప్‌కు ఎంపిక

వాల్మీకిపురం : ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా ఎస్‌సీఈఆర్‌టీ వారి యునిసెఫ్ సహాయంతో విజయవాడ సాల్ట్ ఆఫీస్‌లో ఈ నెల 22న నిర్వహించబోయే రాష్ట్ర స్థాయి వర్క్ షాప్‌కి వాల్మీకిపురం పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయులు రవీంద్ర రెడ్డి ఎంపికయ్యారు. ఇందులో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో భాగంగా ప్రాణాధారమైన నీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య, సేవలు, ఆరోగ్యం, అభ్యాసం, గౌరవాన్ని విద్యార్థులకు అందించడం, పలు అంశాలపై చర్చించనున్నారు.

సురక్షిత ప్రయాణమే ధ్యేయం

మదనపల్లె సిటీ : ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమని, డ్రైవర్లు జాగ్రత్తగా వాహనాలు నడపాలని ఆర్టీసీ డిప్యూటీ సీఎంఈ నాగేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక మదనపల్లె వన్ డిపో గ్యారేజీలో వన్,టు డిపోల సిబ్బందితో రోడ్డు భద్రతా మాసోత్సవాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్లు మూరే వెంకటరమణారెడ్డి, ఆర్‌సి నిరంజన్, ఆర్టీసీ సీఐ రేవతి, టు టౌన్ ఎస్.ఐ వెంకటసుబ్బయ్య, విఎస్‌ఆర్ గ్రాండ్ సుధాకర్‌రెడ్డి, మోటివేటర్ రామమూర్తి పాల్గొన్నారు.

గబ్బిలాల నీడలో మాధవరంపోడు


చెట్టుమీద వాలి ఉన్న గబ్బిలాలు


ఆకాశంలో వేలాదిసంఖ్యలో విహరిస్తున్న గబ్బిలాలు

రైల్వేకోడూరు : రైల్వేకోడూరు మండలంలోని మాధవరంపోడు గ్రామంలో వేలాది గబ్బిలాలు జీవిస్తున్నాయి. ఊరిలోని చెట్లపై ఏళ్ల తరబడి స్థిర నివాసం ఏర్పరచుకున్నాయి. ఆ ఊరు నేటికి ప్రతి నిత్యం గబ్బిలాల నీడలోనే ఉంటూ ఉంది. వీటిని కబోది పక్షులు, రాత్రి గువ్వలు అని పిలుస్తుంటారు. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు చెట్లలోనే ఉంటూ పొద్దుపోయాక ఓ చెట్టు పై నుంచి మరో చెట్టుపై వాలుతూ ఊరంతా తిరుగుతూ ఉంటాయి. ఇది చూపరులను ఆకట్టుకోవడమే కాక ఆ గ్రామానికి ఒక నమ్మకంగా ఏర్పడింది. ఆ పక్షులు వచ్చిననాటి నుంచి గ్రామం సుభిక్షింగా ఉందన్న నమ్మకంతో వాటిని తరమడం కాని, కొట్టడం కాని చేయకపోవడం విశేషం. చిన్న పిల్లలకు జబ్బు చేస్తే ఈ చెట్లకింద గబ్బిలాల రెట్టలతో స్నానం చేయిస్తే పోతుందన్న నమ్మకం ఉంది. పైగా ఈ గబ్బిలాలు కూడా ఎన్నో సంవత్సరాలుగా ఊరిని వదిలిపెట్టడం లేదు.

ఖాతాదారుల సహకారంతో బ్యాంకు అభివృద్ధి

తంబళ్లపల్లె : మండల కేంద్రంలోని సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఖాతాదారుల సహకారంతోనే ఏడాదిలో అభివృద్ధిలో నడుస్తున్నట్లు బ్యాంకు చైర్మన్ ప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలోని ములకలచెరువు రోడ్డులొ శనివారం నూతన బ్యాంకు భవనాన్ని ఆయన ప్రారంభించారు. బ్యాంకు ప్రారంభించి ఏడాదిలోనే రూ.10.08 కోట్ల టర్నవర్ జరిగేందుకు ఖాతాదారుల సహకరమే కీలకమన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

మదనపల్లె సిటీ : జవహర్ నవోదయ 6వ తరగతి ప్రవేశ పరీక్ష శనివారం జరిగింది. ప్రవేశ పరీక్షకు 4789 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 3919 మంది విద్యార్థులు హాజరైనట్లు నవోదయ విద్యాలయ సమితి ప్రిన్సిపాల్ గోవిందరావు తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాతో పాటు అన్నమయ్య జిల్లాలో 26 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో ప్రశాంతంగా పరీక్షలు జరిగినట్లు తెలిపారు. మదనపల్లెలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు కేంద్రాల్లో పరీక్షలు జరిగినట్లు ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పర్యవేక్షించారు.

పీలేరు : నవోదయ ప్రవేశ పరీక్షకు 291 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ వి.జి. నటరాజ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కోటపల్లె బాలుర జెడ్పీ ఉన్నత పాఠశాలలో నవోదయ పరీక్ష నిర్వహించారు. మొత్తం 331 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 40 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

వాల్మీకిపురం : స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నవోదయ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. ఆరవ తరగతి ప్రవేశాలకు 146మందికి గానూ 25మంది గైర్హాజరై 121మంది పరీక్షలు రాసినట్లు ఎంఈవో వెంకటరత్నం తెలిపారు.

తంబళ్లపల్లె : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.

జాతీయస్థాయిలో ప్రతిభ చూపాలి


క్రీడాకారులకు కిట్లను పంపిణీ చేస్తున్న రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కొండూరు విజయ్ రెడ్డి, తదితరులు

పెనగలూరు (ఓబులవారిపల్లె): పెనగలూరు మండల క్రీడాకారులు జాతీయస్థాయికి ఎదగాలని రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి, మండల వైస్ ప్రెసిడెంట్ విజయ్ రెడ్డి ఆకాంక్షించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మట్టిలో మాణిక్యం లాగా గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నియోజకవర్గంలో రాణించి జిల్లాస్థాయికి ప్రతి ఒక్కరూ ఎంపిక కావాలని వారు అభిలషించారు. ఈనెల 24 నుంచి నియోజకవర్గస్థాయిలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు జరుగుతాయని, ప్రభుత్వం ఇచ్చిన ఈ కిట్లను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీడీఓ వరప్రసాద్, క్రీడాకారులు పాల్గొన్నారు.

పురుగు నివారణకు సస్యరక్షణ అవసరం


మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారిణి నాగమణి

లక్కిరెడ్డిపల్లి: మామిడిలో పూమొగ్గ దశలో తేనెమంచు పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానశాఖ అధికారిణి నాగమణి సూచించారు. శనివారం మండలంలోని మద్దిరేవుల, కస్తూరిపల్లె గ్రామాలలో మామిడి పూత, పిందె సమయంలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ పూత త్వరగా, ఒకేసారి రావడానికి, ఆడపూల శాతం పెరగడానికి 13–0–45 (మల్టీకే) 10 గ్రాములు లీటర్ నీటికి మ్యాంగో స్పెషల్ 5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించారు. మామిడిలో పూమొగ్గ దశలో తేనెమంచు పురుగు, మసి తెగులు, పక్షికన్ను తెగులు, బూడిద తెగులు ఆశించే అవకాశం ఉందని, వీటి నివారణకు మోనోక్రోటోపాస్ 1.6 మిల్లీ లీటర్ ఒక లీటర్ నీటికి, మ్యాంకోజెబ్ 2 గ్రాములు లీటర్ నీటికి పిచికారి చేయాలని సూచించారు. వీటితో పాటు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా సహాయకులు లావణ్య, పరిమల పాల్గొన్నారు.

భళా.. గిజిగాడి కళ...


కొత్తకోడూరులో తాటిచెట్టుకు వందలాది గూళ్లు


అందంగా గూడు కడుతున్న గిజిగాడు

రైల్వేకోడూరు: ప్రకృతి అందాల్లో పిచ్చుక గూళ్ల సోయగం ఒకటి. గిజిగాడి అల్లిక చూసి ఎవరైనా అబ్బురపడాల్సిందే. సన్నటి గడ్డి పరకలతో అందంగా గాలి ఊయలలాగా గూళ్లను తయారు చేసుకోవడం ఇప్పటికీ ఆశ్చర్యమే. ప్రస్తుతం రేడియేషన్ పెరగడం, ఇతర కాలుష్య కారకాల వల్ల పిచ్చుకుల మనుగడే ప్రశ్నార్థకంగా మారింది. మండలంలోని కొత్తకోడూరులో ఒక తాటిచెట్టుకు ఉన్న వందలాది గిజిగాడి అల్లికలు ఇప్పటికీ కనువిందు చేస్తున్నాయి. ఎండ, వాన, చలి వంటి వాటితో ఎలాంటి ముప్పు వాటిల్లకుండా ఉండేందుకు గిజిగాళ్లు తయారుచేసుకునే ఈ గూళ్లను చూసి ఇంజనీర్లు సైతం భళా.. గిజిగాడి కళ అంటూ నోరెళ్లబెట్టాల్సిందే.

హార్సిలీహిల్స్ సమస్యలపై ప్రత్యేక దృష్టి

పార్కు, ఇళ్లస్థలాలకు భూమి పరిశీలించిన ఆర్డీఓ మురళి


ప్రభుత్వ భూమి పరిశీలిస్తున్న ఆర్డీఓ మురళి

బి.కొత్తకోట : మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ సమస్యలపై ప్రత్యేక దృష్టితో చర్యలు తీసుకుంటున్నామని టౌన్‌షిప్ కమిటీ చైర్మన్, మదనపల్లె ఆర్డీఓ మురళి అన్నారు. శనివారం కొండపై పర్యటించారు. వివిధ అంశాలపై పరిశీలించాక రెవెన్యూ అతిథిగృహ నిర్మాణ పనులు పర్యవేక్షించారు. కమిటీ సమావేశాల్లో చేసిన తీర్మానాల అమలుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అంతకు ముందు బి.కొత్తకోట నగర పంచాయతీలోని ప్రభుత్వ భూములను పరిశీలించారు. నగర పంచాయతీ కోసం పార్కు ఏర్పాటుకు 8 ఎకరాల భూమి కేటాయింపు కోసం భూమిని పరిశీలించారు. అలాగే ఇళ్లస్థలాల కే టాయించే భూమి, వాటి రికార్డులను పరిశీలించారు. రెండు సర్వే నంబర్ల పరిధిలో ఎన్ని ఎకరాల భూమి ఉందని, వాటి స్థితిగతులను తహసీల్దార్ రఫీక్ అహ్మద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆర్‌ఐ బాలాజీ, సర్వేయర్ శ్రీవాణి, వీఆర్‌ఓ అశోక్ పాల్గొన్నారు.